క్లుప్తంగా

బాల కార్మికులను పెట్టుకుంటే చర్యలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: మండల కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. కార్మిక శాఖ, ఐసీడీఎస్, గ్రేట్ విజన్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. దుకాణదారులు బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని లేబర్ ఆఫీసర్ ఆనంద బాబు హెచ్చరించారు. బాల కార్మికులను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. వలస వచ్చిన వారు ఎవరైనా ఉంటే పునరావాసంతో పాటు విద్య, వైద్యం సౌకర్యాలు కల్పిస్తామని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీఎస్. బాబు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత టి.రెడ్డీశ్వరరెడ్డి తల్లి టి.జయమ్మ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన స్వగృహంలో జరిగిన కర్మక్రియలకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పెద్దిరెడ్డి స్వర్ణమ్మ, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీపీలు సురేంద్రనాథరెడ్డి, చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ముర్వత్‌బాషా ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కుప్పం: మీ–సేవా కేంద్రాల్లో కుల, ఆదాయ ధ్రువీకరణ నమోదులో తప్పులు దొర్లుతున్నాయని జాగ్రత్తలు పాటించాలని మీ–సేవా యాజమాన్యానికి తహసీల్దార్ చిట్టిబాబు సూచించారు. గురువారం మీ–సేవాదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా భూముల మ్యుటేషన్ నమోదులో సర్వే నంబర్లు, యజమానుల పేర్లలో తేడాలు రావడంతో ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా మీ–సేవా కేంద్రాల వద్ద మ్యుటేషన్ కుల, ఆదాయ సర్టిఫికెట్లకు నిర్ణయించిన ధరలు పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా మీ–సేవా కేంద్రాలు పనిచేయాలే తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టొద్దంటూ కోరారు.

కోలాహలం.. శ్రీసల్లాపురెమ్మ జాతర

బైరెడ్డిపల్లె: మండలంలోని కొత్తయిండ్లలో శ్రీ సల్లాపురెమ్మ జాతరను బుధవారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో శ్రీ సల్లాపురెమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గురువారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వ ఖాజీగా ముఫ్తి అబ్దుల్లా



ఖాజీగా ముఫ్తి అబ్దుల్లాతో పట్టణ మైనారిటీ నేతలు

పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఖాజీగా పట్టణానికి చెంది ముఫ్తి అబ్దుల్లా రెండో సారి నియమితులయ్యారు. గత ప్రభుత్వంలోనూ ఇతనే ఖాజీగా పనిచేసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి ప్రభుత్వంలోనూ స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో ఇతన్నే ఖాజీగా నియమించారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికోసం తాను కృషిచేస్తానని ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలను తెలిపారు. పట్టణ మైనారిటీ నాయకులు ఖాజా, హజరత్ జుబేర్ షరీఫ్, చాంద్‌బాషా, ఖలీలుల్లా, అఫ్రోజ్, ఇమామ్, పటేల్, మత్వాలి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చిరు ధాన్యాలను పండించాలి

గుడుపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో చిరు ధాన్యాల పంటలను పండించాలని వ్యవసాయశాఖాధికారి నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని సంగనపల్లె, చీకటిపల్లె గ్రామాల్లో చిరుధాన్యాలపై పంటల సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు రాగి, సామ, కొర్రలు వరిగలు, అరికలు వంటి పంటలపై ప్రాధాన్యత చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఈ పంటలను పండించడంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. ఈ పంటల ద్వారా వచ్చే ధాన్యాలను వాడితే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

నేడు పుష్పపల్లకీ

వి.కోట: పట్టణంలో వెలసిన వీరాంజనేయస్వామి వారికి శుక్రవారం నిర్వహించే పుష్పపల్లకికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతిఏటా పట్టణంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఆనవాయితీగా వీరాంజనేయస్వామికి పుష్పపల్లకీ నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి వీరాంజనేయస్వామిని పుష్పపల్లకీపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తారు. ఊరేగింపు రాత్రి 9 గంటలకు ప్రారంభమై శనివారం ఉదయం 5గంటల వరకు కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.





డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

ఆరోగ్యానికి పొగ

- విషం చిమ్ముతున్న డంపింగ్ యార్డు
- ఆరు ప్రాంతాలకు శాపంగా మారిన వైనం
- పగలు,రాత్రి వెలువడుతున్న పొగ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా లేని ఫలితం
- ప్రాణాలను కాపాడాలంటూ వేడుకుంటున్న జనం

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి కుప్పం పర్యటనలోనూ స్వచ్ఛభారత్ నినాదాన్ని వల్లిస్తూనే ఉంటారు. కానీ ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదు. మోడల్ కాలనీ సాయిబాబా దేవాలయం పక్కన ఉన్న మున్సిపాలిటీ డంపింగ్ యార్డు నుంచి నిత్యం దట్టమైన పొగ వెలువడడమే ఇందుకు ఒక కారణం. డంపింగ్ యార్డు నుంచి రాత్రి పగలు తేడా లేకుండా దట్టమైన పొగ వస్తుండడంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు.

అనారోగ్యం బారిన పడుతున్న గ్రామస్తులు...

మున్సిపాలిటీ డంపింగ్ యార్డు నుంచి పొగ వెలువడుతుండడంతో పలవరిగానిమిట్ట, మల్దేపల్లి, మోడల్, శ్రీలంక, అమరావతి కాలనీలు, డి.కె.పల్లి వంటి ఏడు ప్రాంతాలకు పొగ విస్తరిస్తోంది. పగలు కొంతవరకు లేకపోయినా రాత్రిపూట పొగ మరింత ఎక్కువ అవుతోంది. దీంతో కొన్ని మార్లు శ్వాస పీల్చుకోవడం కూడా కావడం లేదని జనం ఆవేదన చెందుతున్నారు. ఆరు నెలల నుంచి ప్లాస్టిక్ కాలనీ పొగతో తలనొప్పి, కడుపులో మంట, పిల్లలు అయితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పలవరిగానిమిట్ట గ్రామానికి ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. దుర్వాసన భరించలేక కొన్ని మార్లు మహిళలు వాంతులు చేసుకుంటున్నారు. పక్కనే ప్రత్యాంగర దేవి దేవాలయం ఉంది. పౌర్ణమి, ప్రత్యేక దినాల్లో పెద్ద ఎత్తున పూజలు చేస్తుంటారు. ఈ సమయంలో భక్తులను దుర్వాసనతో కలిగిన పొగ చుట్టేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పంటలకూ నష్టమే..

దట్టమైన పొగ వస్తుండడంతో పలవరిగానిమిట్ట, మల్దేపల్లి గ్రామాల పరిధిలో పంటలు సైతం సక్రమంగా పండడం లేదు. పొగ వచ్చి పంటలపై వాలుతుండడంతో పంటలకు రోగాలు సోకి మొదట్లోనే కుళ్లిపోతున్నాయని రైతులు అంటున్నారు. కూరగాయలు, పండ్లపై పొగ పేరుకుపోతుండడంతో రంగు మారి చెడిపోతున్నాయని రైతులు అంటున్నారు. నిలువ ఉన్న నీరు సైతం పశువులు, గొర్రెలు తాగేందుకు వీలు కావడం లేదని బాధిత గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి డంపింగ్ యార్డును మార్చాలని చుట్టు పక్కల గ్రామస్తులు కోరుతున్నారు.

పొగతో రోగాలు...

కుప్పం మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్ యార్డును మోడల్ కాలనీ సాయిబాబా దేవాలయం పక్కన ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం నిర్మాణ సమయంలో స్థానికులు ఇక్కడ డంపింగ్ యార్డు నిర్మాణం వద్దని పలవరిగానిమిట్ట, మల్దేపల్లి గ్రామస్తులు ఆందోళన చేశారు. పట్టించుకోని అప్పటి టీడీపీ నాయకులు, అధికారులు బలవంతంగా డంపింగ్ యార్డు నిర్మాణం చేశారు. అప్పటి నుంచి కుప్పం పట్టణంలోని ఇళ్ల నుంచి వచ్చే చెత్తాచెదారం ఈ డంపింగ్ యార్డుకు చేరుతుంది. యార్డు నిండిపోవడంతో ఖాళీ చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు అగ్గి పెట్టినట్లు తెలుస్తోంది. గత ఆరు నెలలుగా చెత్త నుంచి దట్టమైన పొగ వెలువడుతూనే ఉంది.

> **అధికారులకు చెప్పినా ఫలితం లేదు..**
>
> అధికారులు, నాయకులకు ఎన్నిమార్లు చెప్పినా ఫలితం లేకపోతోంది. రాత్రి అయ్యిందంటే పొగ విపరీతంగా వెలువడుతుంది. గాలి ఎటువైపు వీస్తే అటువైపు పొగ దిశ మార్చుకుంటూ నలు దిక్కులు వ్యాపిస్తోంది. దీంతో కాలనీలో చాలా మంది కొన్ని మార్లు ఊపిరి పీల్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది.
>
> – నాగరాజు, అమరావతి కాలనీ వాసి

> **ఆస్పత్రికి వెళ్లాల్సిందే..**
>
> డంపింగ్ యార్డు నుంచి దుర్వాసనతో కూడిన పెద్ద ఎత్తున పొగ వస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర రోగాల బారిన పడుతున్నారు. వారంలో నాలుగు రోజులైనా చిన్నపెద్ద తేడా లేకుండా ఆస్పత్రి పాలవ్వాల్సిందే. డంపింగ్ యార్డు అతి సమీపంలో గ్రామం ఉండడంతో పంటలు పండడం లేదు. నీరు కలుషితమవుతోంది.
>
> – మురళి, పలవరిగానిమిట్ట

నేడు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

గంగవరం: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు రుణ దరఖాస్తు గడువు ముగియడంతో నేడు మండల పరిధిలోని అన్ని బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తప్పకుండా మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

పుంగనూరు: మండలంలోని నెక్కుంది వద్ద వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రధాన అర్చకులు షణ్ముగదీక్షితులు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ప్రతిఏటా నిర్వహించే రీతిలో ఉత్సవాలు మార్చి 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న శివరాత్రి పూజలు, అభిషేకాలు విశేషంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 28న కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

రేపు కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఆ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఈనెల 22న శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ నేతలు మునస్వామి మొదలియార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి జబ్బులు కలిగిన రోగులు వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు హానికరం



కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: బాల్యవివాహాలు చేసుకోవడం ఆరోగ్యానికి హానికరమని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు, కుటుంబసమస్యలు, చదువుకు దూరమై కొంత మంది బాలికలు బాల్య వివాహాలను చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వివాహ వయస్సు వచ్చేంత వరకు పెళ్లి చేసుకోరాదన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వలన పుట్టబోయే బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదకరమన్నారు. అలాగే తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గొల్లచీమనపల్లె పాఠశాలలో రక్తహీనత వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద జ్ఞానజ్యోతి కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఖోఖో, కబడ్డీ, పరుగు పందేలు, వాలీబాల్ ఆటల పోటీలను పులిచెర్ల హైస్కూల్, ఎంపీపీ స్కూల్లో నిర్వహించారు. గెలుపొందిన వారికి మార్చి 8న మహిళా దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు అందజేసారని ఈసందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, విజయలక్ష్మి, ఆర్పీలు వెంకటశివ, సయ్యద్‌బాషా, రామాంజులు, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయమే లక్ష్యం



మాట్లాడుతున్న భాస్కర్

పలమనేరు: సమాజంలోని అందరికి సమన్యాయమే న్యాయవ్యవస్థ లక్ష్యమని న్యాయవాది ఎల్.భాస్కర్ అన్నారు. ఆమేరకు పట్టణ సమీపంలోని శికారి కాలనీలో ప్రపంచ సామాజిక దినోత్సవం సందర్భంగా గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక కోర్టు న్యాయమూర్తుల ఆదేశాలతో న్యాయవాదులు నిర్వహించారు. అయన మాట్లాడుతూ వివక్ష లేకుండా చట్టం అందరికీ సమానమే అనే భావన కల్పించేందుకు ఏటా ఫిబ్రవరి 20న ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. సమాజంలో శాంతిని నెలకొల్పి సామాన్య ప్రజలు సైతం న్యాయాన్ని కచ్చితంగా పొందాలన్నదే లక్ష్యమని తెలిపారు. జీపీ కృష్ణమూర్తి, ఆరీఫుల్లా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కనులపండువగా ఆవులపబ్బం



చాందినీ బండ్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లె: మండలంలోని పన్నెండు గ్రామాల ప్రజలు కలిసి పరికిదొన గ్రామంలో ప్రతిఏటా నిర్వహించే ఆవులపబ్బం గురువారం కనులపండువగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పండుగ ముందు వారంలో ప్రతిఏటా ఆవులపబ్బం నిర్వహించడం పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఈ పండుగను గ్రామస్తులు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ప్రజలందరూ పోటాపోటీగా పశువులను ముస్తాబు చేసి నాగప్ప చెరువులో 12 గ్రామాలకు చెందిన పశువులను ఒకే చోటకు మందగా తోలి పశు సంపద పెరగాలని కోరుతూ కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు. చాందినీ బండ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో నుంచి నాగప్పచెరువు మీదుగా కాటమరాజుల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చాందినీ బండ్లలో ఏర్పాటుచేసిన కాటమరాజులకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం సాయంత్రం చిట్లాకుప్పకు నిప్పంటించి పశువులపై ముద్దకూడును చల్లారు. పన్నెండు గ్రామాల్లోని ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కిటకిటలాడాయి.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వీరే!



హఫీజ్



మురుగేష్

కుప్పం: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షులను నియమించింది. మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీకి కూడా ఈసారి ప్రత్యేకంగా వైఎస్సార్‌సీపీ అర్బన్ అధ్యక్షుడిని నియమించారు. కుప్పం మండలానికి హెచ్.ఎం.మురుగేష్, కుప్పం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎస్.డి.హఫీజ్, గుడుపల్లెకు ఎ.రామక్రిష్ణ, రామకుప్పంకు వెంకట్రమణారెడ్డి (బాబు), శాంతిపురం మండలానికి దండపాణిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్కిల్‌హబ్‌లో ఉచితంగా డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పదో తరగతి నుంచి డిగ్రీ దాకా చదువుకున్న వారు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటేశులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తారని, దీంతో పలు ఉద్యోగ ఉపాధి అవకాశాలుంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు 8465830771 అనే నంబర్‌కు మరిన్ని వివరాల కోసం సంప్రదించగలరని సూచించారు.

పంటలపై ఏనుగుల బీభత్సం



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంటను పరిశీలిస్తున్న ఎఫ్‌బీఓ రవికుమార్

పెద్దపంజాణి : మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి, రాయలపేట, కోగిలేరు, కొళత్తూరు పంచాయతీల పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, బందార్లపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, ఆకులవారిపల్లి, దాసనంపల్లి, గుత్తివారిపల్లి, పొట్టగానిపల్లిలో పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం రాత్రి పలమనేరు రేంజ్ కీలపట్ల ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు గుర్తివారిపల్లికి చెందిన మణి, శివయ్య వరి పొలాన్ని తొక్కి నాశనం చేశాయి. అదేవిధంగా పలువురు రైతులు సాగు చేసిన బీర, టమాట పంటలను ధ్వంసం చేశాయి. మామిడి చెట్లను విరిచేసి మరలా కీలపట్ల ఫారెస్టు బీటులోకి వెళ్లాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలను చూసి ఆందోళనకు గురయ్యారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపించి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏనుగులు పంటలపైకి రాకుండా ట్రాకర్ల సాయంతో అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరులకు రక్షణ కల్పించాలి

పలమనేరు: రాష్ట్రంలో ఎటూ చూసిన విలేకరులపై దాడులు పెరుగుతున్నాయని సమాజం కోసం కష్టపడే వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక విలేకరులు ఆర్డీఓ భవానికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ తాజాగా మన్యం జిల్లా పార్వతీపురం ప్రజాశక్తి విలేకరి రామారావుపై అక్కడి టీడీపీ నాయకులు దాడి చేయడంపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం విలేకరుల కోసం రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇందులో పలువురు స్థానిక విలేకరులు పాల్గొన్నారు.

టి.వడ్డూరులో పేడదిబ్బల తొలగింపు



హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన సర్పంచ్, సిబ్బంది

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో రోడ్లు, వీధుల పక్కన వేసిన పేడ దిబ్బలను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. సర్పంచ్ మునస్వామి అక్కడ చెత్త, పేడ పడేయరాదంటూ బోర్డులను సైతం ఏర్పాటు చేయించారు. అదేవిధంగా గ్రామ సమీపంలోని చెరువులో వేసిన బోరు నుంచి గ్రామానికి మంచినీరు సరఫరా అవుతుండడంతో చెరువులో ఎలాంటి వ్యర్థాలను పడేయరాదని బోర్డులను అమర్చారు. ఎవరైనా వ్యర్థాలను పడేస్తే జరిమానా విధిస్తామంటూ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

–నేటితో ముగియనున్న ప్రత్యేక కార్యక్రమాలు



లక్ష కుంకుమార్చనలో దంపతులు

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండో రోజైన గురువారం కుంకుమార్చన పూజలు వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీ హోమం, మహా మంగళహారతి చేశారు. 151 దంపతులకు అమ్మవారి సన్నిధిలో పూజలు చేయించారు. రెండు రోజులుగా సాగుతున్న లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగియనున్నట్లు ఈఓ ఏకాంబరం పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రమాదవశాత్తు మృతిచెందితే అలాంటి సంఘటనను తప్పుడు ప్రచారం చేసి ప్రజలకు అపనమ్మకం కలిగించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిపే విధంగా మీడియా పనిచేయాలన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన ఇలాంటి వాస్తవ వక్రీకరణ ఘటనలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సమాచారం పూర్తిగా సమగ్రంగా విచారించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. రూరల్ సీఐ మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

కార్లు ఢీ: మహిళకు గాయాలు

రొంపిచెర్ల : రెండు కార్లు ఢీకొని ఒక మహిళ గాయపడిన సంఘటన మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల మండలం మట్లోళ్లపల్లె సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా ఏర్పేడుకు చెందిన ఒక కుటుంబం కారులో పీలేరుకు బయలుదేరారు. అలాగే అన్నమయ్య జిల్లా దేవపట్లకు చెందిన మరో కుటుంబం కారులో తిరుపతికి పోతుండగా బుధవారం రాత్రి 10 గంటలకు మట్లోళ్లపల్లె సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏర్పేడు నుంచి పీలేరు వైపు వస్తున్న కారులో ఉన్న మహిళ పద్మావతి గాయపడింది. గాయపడిన పద్మావతిని 108లో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్లు రెండు దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రాణాపాయం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.